సాక్షి
నంద్యాల
శుక్రవారం | 15 | డిసెంబర్ | 2023



నీటి విడుదల నిలిపివేత

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో నిలిచి పోయింది. దీంతో కేసీ కాల్వకు నీటి విడుదల నిలిపివేశారు. ప్రస్తుతం డ్యాంలో 1.194 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



శ్రీమఠంలో భక్తుల సందడి

మంత్రాలయం: శ్రీరాఘవేంద్రస్వామి మఠంలో గురువారం భక్తుల సందడి నెలకొంది. భక్తులు రాఘవేంద్రుల మూలబృందావనాన్ని, గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకున్నారు.



పాదరక్ష.. బతుకు దీక్ష

చెప్పుల తయారీ పరిశ్రమగా మారడంతో చర్మకారుల పరిస్థితి దుర్భరంగా మారింది. అయితే కొందరు ఇప్పటికీ రోడ్ల పక్కనే చెప్పులు కుడుతూ జీవనం సాగిస్సున్నారు.

10లో▸

న్యూస్‌రీల్

ముచ్చుమర్రి, మల్యాల నుంచి కేసీకి సాగునీరు



కేసీకాల్వలో ప్రవహిస్తున్న సాగునీరు

జూపాడుబంగ్లా: ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం మూడు మోటార్లు, మల్యాల ఓ మోటారు ద్వారా కేసీ కాల్వకు 1,080 క్యూసెక్కుల సాగునీటిని సరఫరా చేస్తున్నట్లు కేసీ కాల్వ ఏఈ శ్రీనివాసనాయక్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సుంకేసుల డ్యాం నుంచి కేసీ కాల్వకు సాగునీటి సరఫరా నిలిచిపోవటంతో ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల పథకాల ద్వారా కేసీ కాల్వకు సాగునీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఈ నీటిని లాకిన్స్‌లా నుంచి నిప్పులవాగుకు 112 క్యూసెక్కులు, తూడిచెర్ల సబ్ చానల్ కాల్వకు 600 క్యూసెక్కుల సాగునీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం వస్తున్న సాగునీటిని రైతులు వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నీటిని వృథా చేయొద్దు



18వ బ్లాకు తూము వద్ద రైతులతో మాట్లాడుతున్న ఈఈ శంకర్‌రెడ్డి

రుద్రవరం: తెలుగుగంగ కాల్వకు విడుదల చేసిన నీటిని వృథా చేయొద్దని ఈఈ శంకర్‌రెడ్డి రైతులకు సూచించారు. వర్షాభావ పరిస్థితుల్లో పంటలను కాపాడేందుకు వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయరు నుంచి 2 వేల క్యూసెక్కుల నీటిని ప్రభుత్వం విడుదల చేసింది. ఆ నీరు ప్రధాన కాల్వల ద్వారా పారుతూ మండల కేంద్రమైన రుద్రవరానికి సమీపాన నల్లమల అటవీ ప్రాంతంలో ఉన్న గండ్లేరు (తుండ్లవాగు) రిజర్వాయరుకు చేరింది. అక్కడి నుంచి ఉప ప్రధాన కాల్వలకు నీటిని విడుదల చేశారు. నీరు అందుబాటులోకి రావడంతో రైతులు సాగు చేసిన జొన్న, మినుము, మొక్కజొన్న వంటి పంటలకు పారించుకుంటున్నారు. ఈ మేరకు గురువారం ఈఈ శంకర్‌రెడ్డి ప్రధాన కాల్వ వెంట నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. 18వ బ్లాక్ కాల్వ వద్ద పలు గ్రామాల రైతులు తాము జొన్న పంట సాగు చేశామని పంట ప్రస్తుతం కీలక దశలో ఉందని ఈ ఒక్క తడికి కాస్త కాల్వలో నీటిని పంచాలని కోరారు. వెంటనే ఆయన లస్కర్లు, ఏఈల ద్వారా 18వ బ్లాక్ ఉప ప్రధాన కాల్వకు నీటిని అదనంగా విడుదల చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాల్వల ద్వారా వచ్చే నీటిని అవసరమైనంత మాత్రమే వాడుకోవాలని సూచించారు.

ఏఎస్ఐ కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయమందిస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

బొమ్మలసత్రం: సంజామల పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తూ కొంత కాలం క్రితం అనారోగ్యంతో మృతి చెందిన ఏఎస్ఐ గంగన్న కుటుంబానికి ఎస్పీ రఘువీర్‌రెడ్డి గురువారం ఆర్థిక సహాయం అందజేశారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏఎస్ఐ గంగన్న భార్య లక్ష్మీనారాయణమ్మకు విడోఫండ్ కింద రూ. 50 వేలు, ఫ్లాగ్ ఫండ్ రూ. 25 వేలను ఎస్పీ అందించారు. సిబ్బంది సమస్యల పరిష్కారానికి ముందుంటామని ఎస్పీ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాసులు, ఏవో నిజాముద్దీన్ ఆర్ఎస్ఐ వీరన్న పాల్గొన్నారు.

సివిల్స్ అర్హులకు 'జగనన్న ప్రోత్సాహకాలు'

కర్నూలు(అర్బన్): యూపీఎస్సీ నిర్వహించే ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షల్లో అర్హత సాధించిన వెనుకబడిన వర్గాలు, ఆర్థికంగా బలహీనులైన వారికి 'జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకాలు ' పథకంలో భాగంగా నగదును అందించనున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ జే రంగలక్ష్మీదేవి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రిలిమ్స్‌లో అర్హత సాధించిన వారికి రూ. లక్ష, మెయిన్స్‌లో అర్హత సాధించిన వారికి రూ.50 వేలను ప్రభుత్వం అందజేయనుందన్నారు. 2023లో నిర్వహించిన యూపీఎస్సీ మెయిన్ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు నగదు ప్రోత్సాహకం కింద రూ.50 వేలను అందించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి మెయిన్స్‌లో అర్హత సాధించిన అభ్యర్థులు jnanabhumi.ap.gov.in పోర్టల్‌లో అందించిన వెబ్ లింక్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు నమోదు చేసి ఈ నెల 19వ తేదీలోగా పంపాలన్నారు.

నోరూర.. గోరుముద్ద

- ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పౌష్టికాహారం
- ఇంటి భోజనాన్ని మరిపిస్తున్న జగనన్న గోరుముద్ద
- పకడ్బందీగా మెనూ అమలు



బనగానపల్లె ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నభోజనం చేస్తున్న విద్యార్థులు

బనగానపల్లె: పేద విద్యార్థులు ఆహ్లాదకర వాతావరణంలో శ్రద్ధగా చదువుకునేలా వసతులు కల్పిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం వారి ఆరోగ్య దృష్ట్యా మధ్యాహ్న భోజనాన్ని మరింత బలవర్ధకంగా మార్చేసింది. గత ప్రభుత్వ పాలనలో 'వండిందే మెనూ.. పెట్టిందే తినూ' అనేటట్లుగా ఉండేది. ఉడకని అన్నం.. చారులాంటి పప్పు.. నీళ్లలాంటి రసం.. వెతికినా పౌష్టికాహారం కనిపించేది కాదు. దీంతో చాలా మంది విద్యార్థులు ఇంటి నుంచి క్యారేజ్లు తెచ్చుకోవడం, మరి కొందరు ఇళ్లకే వెళ్లడం జరిగేది. ప్రభుత్వం మారి సర్కారు పాఠశాలలో మధ్యాహ్న భోజనం నిర్వహణలో ఎంతో మార్పు వచ్చింది. పేద విద్యార్థులు నోరూర తినేలా జగనన్న గోరుముద్దగా మార్చేసి పౌష్టికాహారాన్ని అందిస్తోంది. జిల్లాలో మొత్తం 1,195 పాఠశాలలు ఉండగా 1,21,201 మంది విద్యార్థులు ఉన్నారు. ఇందులో 182 ఉన్నత పాఠశాలల్లో 59,969 మంది విద్యార్థులు 150 యూపీ పాఠశాలల్లో 14,881 మంది, 863 ఎంపీపీ పాఠశాలల్లో 46,351 మంది విద్యార్థులు ఉన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విద్యా రంగానికి పెద్దపీట వేసి వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇచ్చింది. ముఖ్యంగా నాడు-నేడుతో పాఠశాలల రూపురేఖలు మార్చేసింది. తరగతి గదుల మొదలు టాయిలెట్లు, నీటి వసతి, బెంచీలు, విద్యుత్ దీపాలు.. ఇలా అన్ని సమకూర్చింది. ఇదే క్రమంలో పేద విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని మరింత రుచికరంగా మార్చింది. పౌష్టికాహారం ఉండే వంటకాలను మెనూలో చేర్చి జగనన్న గోరుముద్దను నాణ్యతగా అందిస్తోంది.



భోజనం వడ్డిస్తున్న దృశ్యం

మూడు చిక్కీలు.. ఐదు కోడిగుడ్లు..

ప్రభుత్వ పాఠశాలల్లో జగనన్న గోరుముద్ద మెనూ పక్కాగా అమలు చేస్తున్నారు. రోజుకో మెనూతో రుచికరమైన ఆహారం అందించేందుకు అధికారులు ప్రణాళిక రూపొందించారు. అదే క్రమంలో ఉన్నతాధికారుల పర్యవేక్షణ నిరంతరం ఉండటం, నిత్యావసరాలను ముందే అందజేస్తుండటంతో మెనూ క్రమం తప్పకుండా అమలవుతోంది. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ఉదయం రాగి జావ, మధ్యాహ్నం జగనన్న గోరుముద్ద పేరుతో పౌష్టికాహారాన్ని అందజేస్తున్నారు. రోజుకో రకమైన మెనూ అమలు చేస్తున్నారు. వారానికి 5 కోడిగుడ్లు, మూడు చిక్కీలు అందజేస్తున్నారు. వారానికి 15 వెరైటీలు ఉండేలా చర్యలు ప్రభుత్వం చేపట్టింది. పేద విద్యార్థుల తల్లిదండ్రులపై ఆర్థిక భారం పడకుండా జగనన్న గోరుముద్ద పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తోంది.

ప్రభుత్వ పాఠశాలల్లో గోరుముద్ద మెనూ వివరాలు..

రోజు	ఆహార పదార్థాలు
సోమవారం	హాట్ పొంగల్, గుడ్డు కూర, కూరగాయల పులావ్, చిక్కీ,
మంగళవారం	రాగి జావా, పులిహోర, టమాట పచ్చడి, దొండకాయ పచ్చడి, ఉడికించిన గుడ్డు
బుధవారం	వెజిటబుల్ బిర్యానీ, ఆలు కుర్మా, ఉడికించిన గుడ్డు, చిక్కీ
గురువారం	రాగి జావా, సాంబార్ బాత్, ఉడికించిన గుడ్డు
శుక్రవారం	రాగి జావా, ఆకుకూర పప్పు, ఉడికించిన గుడ్డు, చిక్కీ, సాంబారు
శనివారం	రాగి జావా, తీపి పొంగలి, ఆకుకూర అన్నం, పప్పుచారు, ఉడికించిన గుడ్డు

విద్యార్థుల హాజరు పెరిగింది



జగనన్న గోరుముద్ద నాణ్యతగా అందిస్తుండటంతో పాఠశాలల్లో విద్యార్థుల హాజరు పెరిగింది. ఈ పథకం అమలులో ఎక్కడా అక్రమాలకు తావులేకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశాం. ప్రతి పాఠశాలలోనూ ఈ పథకం విజయవంతంగా అమలవుతోంది. ప్రభుత్వం సూచించిన మెనూను పకడ్బందిగా అమలు చేస్తున్నాం. ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షిస్తున్నాం.

– స్వరూప, ఎంఈఓ, బనగానపల్లె మండలం

పిల్లలు క్యారేజీ తీసుకెళ్లడం లేదు



నేను గ్రామాల్లో తిరుగుతూ వస్త్ర వ్యాపారం చేస్తాను. కొన్ని సమయాల్లో ట్రాక్టర్ డ్రైవర్‌గా వ్యవసాయ పనులకు వెళ్తుంటాను. నాకు ఇద్దరు కుమారులు ఉన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పెద్దోడు లక్ష్మీనరసింహ 10వ తరగతి, చిన్నోడు లక్ష్మీనరసింహ రాజు 9వ తరగతి చదువుతున్నారు. గతంలో ముగ్గిన అన్నం, నీళ్ల చారులా ఉండే పప్పును పిల్లలు తినలేక ఇంటి నుంచి క్యారేరు తీసుకెళ్లేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. జగనన్న గోరుముద్ద చాలా రుచికరంగా ఉండటంతో అక్కడే తింటున్నారు.

– తోకల శివనారాయణ, విద్యార్థి తండ్రి, ఇల్లూరు కొత్తపేట గ్రామం, బనగానపల్లె మండలం

రోజుకో వంటకం బాగుంది



బడిలో చేసే వంటకాలు ఇంట్లో కూడా చేయలేం. పిల్లలు తినేలా రోజుకో రకం వండటం బాగుంది. నేను బండల ఫ్యాక్టరీలో కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాం. పెద్ద కుమారుడు హర్షిత్‌కుమార్ 6వ తరగతి స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్నాడు. కవల పిల్లలు మహిదర్, మధుప్రియ స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్నారు. సీఎం వైఎస్ జగన్ పుణ్యమా అని పిల్లలకు చదువుతో పాటు మంచి ఆహారం వడ్డిస్తూ పేదలకు ఎంతో మేలు చేస్తున్నారు.

– పి.బాలహుస్సేనమ్మ, విద్యార్థి తల్లి, బీసీ కాలనీ, బనగానపల్లె

విద్యార్థులు ఇష్టంగా తింటున్నారు



రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి పెద్దపీట వేసి నాణ్యమైన చదువులతో పాటు రుచికరమైన మధ్యాహ్న భోజనాన్ని అందిస్తోంది. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని గుడ్డు, రాగి జావ, చిక్కీలతో పాటు వంటల్లో ఆకు కూరలు, కూరగాయలు చేర్చడం శుభపరిణామం. విద్యార్థులు ఇష్టంగా తింటున్నారు. పౌష్టికాహారం అందుతుండటంతో ఆరోగ్యకరంగా ఉంటున్నారు.

– శ్రీనివాసరెడ్డి, సైన్స్ టీచర్, జెడ్పీ బాలికల పాఠశాల బనగానపల్లె

అభివృద్ధి ఫలాలు ప్రజలకందాలి

- మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి



కొచ్చెర్వు చెరువును పరిశీలిస్తున్న ఆర్థిక మంత్రి బుగ్గన

డోన్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలు వినియోగించేలా చూడాలని అధికారులు, కాంట్రాక్టర్లకు ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి సూచించారు. గురువారం పట్టణ శివారులోని రూ.3 కోట్లతో నిర్మిస్తున్న టీటీడీ కల్యాణ మండపం పనులను పరిశీలించి కాంట్రాక్టర్‌పై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏడాది క్రితమే నిధులు మంజూరైనా కూడా పనుల్లో పురోగతి లేకపోవడంతో మంత్రి అసహనం వ్యక్తం చేశారు. తన మంచితనాన్ని ఆసరాగా తీసుకొని పనుల్లో జాప్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. జగదుర్తి గ్రామం వద్ద సోలార్ ప్లాంట్ సమీపంలో అధికారులు సేకరించిన 36 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని ఆయన గురువారం మంత్రి పరిశీలించారు. ఈ స్థలంలో ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటు చేసి చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. ఇదే స్థలంలో కొంత భాగం ఆటో నగర్ ఏర్పాటు చేసే అవకాశాన్ని పరిశీలించి తనకు తగిన ప్రతిపాదనలు పంపాలని ఆయన ఏపీఐఐసీ జోనల్ అధికారి గంగాధర్‌ను ఆదేశించారు. డోన్ మండలంలోని కొచ్చెర్వు, ఉడుములపాడు చెరువుల స్థిరీకరణ పనులను మంత్రి బుగ్గన పరిశీలించారు. హంద్రీనీవా నీటితో చెరువులను నింపే కార్యక్రమంపై ఆరా తీసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, తహసీల్దార్ విద్యాసాగర్, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడులతో పాటు ఇరిగేషన్ అధికారులు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీల నియామకం







ఇసాక్‌బాషా, భీమునిపల్లె వెంకటసుబ్బయ్య, నెరవాటి రవి, కారు రవికుమార్, శివశంకర్ నాయుడు

నంద్యాల: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నంద్యాల జిల్లాకు చెందిన నాయకులకు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీలలో చోటు లభించింది. పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం విడుదల చేసిన ప్రకటన మేరకు నియామకాలు ఇలా ఉన్నాయి. వైఎస్సార్‌సీపీ స్టేట్ బీసీ సెల్ కార్యదర్శిగా బి. శివశంకర్ నాయుడు, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శిగా పాస్టర్ వై.జోసెఫ్, కార్యదర్శిగా కారు రవికుమార్, రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులుగా ఇసాక్‌బాషా(ఎమ్మెల్సీ), జోనల్ ఇన్‌చార్జ్‌గా అబుబకర్, కార్యదర్శిగా అల్తాఫ్ జాహిద్ హుసేన్, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శిగా ఎం.శివరామసుబ్బారెడ్డి, రాష్ట్ర వాణిజ్య విభాగం జోనల్ ఇన్‌చార్జిగా బి.వెంకటసత్యనారాయణ, కార్యదర్శిగా పువ్వాడి భాస్కర్, జాయింట్ సెక్రటరీగా నెరవాటి రవి, రాష్ట్ర వీవర్స్ వింగ్ కార్యదర్శిగా భీమునిపల్లె వెంకటసుబ్బయ్యను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటన విడుదల చేసింది.

వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర సెక్రటరీగా మాధురి



నందికొట్కూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర సెక్రటరీగా హిజ్రా మాధురిని కేంద్ర పార్టీ కార్యాలయం గురువారం నియమించింది. ఈ సందర్భంగా హిజ్రా మాధురి మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించడం ఆనందంగా ఉందన్నారు. పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తానన్నారు. ఓటు హక్కు ఉన్న విద్యార్థులకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించి అవగాహన కల్పిస్తానన్నారు.

నష్టపోయాం.. ఆదుకోండి

- కేంద్ర కరువు బృందానికి రైతుల విన్నపం
- ఆర్ఎస్ రంగాపురంలో కంది పంటను పరిశీలించిన బృందం సభ్యులు



ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో కంది పంటను పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

బేతంచెర్ల: వర్షాభావ పరిస్థితులతో పంటలు ఎండిపోయి నష్టపోయిన తమకు పరిహారం అందించి ఆదుకోవాలని కేంద్ర కరువు బృందానికి రైతులు విన్నవించారు. నీతిఆయోగ్ సీనియర్ రీసెర్చ్ ఆఫీసర్ బి. అనురాధ, కేంద్ర తాగునీరు, శానిటేషన్ శాఖ అసిస్టెంట్ అడ్వైజర్ ఆర్. సంతోష్, కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ శాఖ సెక్రటరీ సంగీత్ కుమార్‌తో కూడిన కేంద్ర బృందం సభ్యులు గురువారం మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో పర్యటించారు. గ్రామానికి చెందిన రైతులు ఉసేన్ బాషా, వడ్ల మూడవ ఖాసీంకు చెందిన కంది పంటను పరిశీలించారు. అనంతరం గ్రామంలో కరువుపై ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్ తిలకించారు. ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి మండంలోని కరువు పరిస్థితులను వివరించి రైతులను ఆదుకోవాలని కేంద్ర కరువు బృందం సభ్యులకు విన్నవించారు. అలాగే సీపీఐ నంద్యాల జిల్లా కార్యదర్శి రంగనాయుడు, మండల కార్యదర్శి భార్గవ్, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం నాయకులు ఈశ్వరయ్య, సుబ్బరాయుడు ఆధ్వర్యంలో డోన్, ప్యాపిలి, నందికొట్కూరు, జూపాడుబంగ్లా, కొలిమిగుండ్ల, సంజామలను కరువు మండలాలుగా ప్రకటించాలని వినతి పత్రం అందజేశారు. ఎకరాకు రూ.30 వేలు నష్టపరిహారం చెల్లించాలని, ఉపాధి హామీ పథకం కింద 200 పనిదినాలు కల్పించాలని, రోజుకు రూ.600 వేతనం కూలీలకు చెల్లించాలన్నారు. కరువు కారణంగా నంద్యాల జిల్లాలో విద్యార్థుల ఫీజులు మాఫీ చేయాలని విన్నవించారు.

రైతులకు పరిహారం.. పశువులకు గ్రాసం ఇవ్వండి

కరువు పరిస్థితుల నేపథ్యంలో పంటలు ఎండి నష్టపోయిన రైతులకు పరిహారంతో పాటు పశువులకు గ్రాసం ఇవ్వాలని కేంద్ర కరువు బృందానికి రైతులు మొరపెట్టుకున్నారు. జిల్లా డీఆర్వో పుల్లయ్య, జిల్లా వ్యవసాయశాఖ అధికారి మోహన్‌రావు ఆధ్వర్యంలో ఆర్ఎస్ రంగాపురం ఆర్బీకేల్లో రంగాపురం, అంబాపురం, బేతంచెర్ల, హెచ్. కొట్టాల రైతులతో పాటు పగిడ్యాల, మిడ్తూరు మండలాల రైతులతో కేంద్ర కరువు బృందం సభ్యులు ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ రంగాపురం గ్రామ సర్పంచ్ గుమ్మగాల్ల రాజు, రైతులు కృష్ణారెడ్డి, మధుశేఖర్ గౌడు, హుసేన్ బాషా, నాగేశ్వర్‌రెడ్డి, రాజేష్ కరువు పరిస్థితులను వివరించారు. సాగుచేసిన కంది, పత్తి, మొక్కజొన్న, వేరుశనగ, ఆముదం, కొర్ర, జొన్న పంటలు వర్షాలు లేక దిగుబడి తగ్గిపోయాయని చెప్పారు. ముఖ్యంగా పాడి పాశువుల రైతులు ట్రాక్టర్ వరి గడ్డి రూ.15–20 వేల వరకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెల కొందన్నారు. ఈ పరిస్థితుల్లో పశుగ్రాసం సరఫరా చేసి ఆదుకోవాలన్నారు. బేతంచెర్ల మండలానికి రూ.11.12 కోట్ల నష్ట పరిహారం మంజూరు చేయాలని కేంద్ర కరువు బృంద సభ్యులకు అధికారులు నివేదికలు అందజేశారు. సాగునీటి వనరులు లేని బేతంచెర్ల మండలంలో కరువుతో పంటలు దెబ్బతిన్నాయని, రైతులను ఆదుకోవాలని డీఆర్వో పుల్లయ్య కేంద్ర కరువు బృందం సభ్యులకు నివేదించారు. వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధకశాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, నీటియాజమాన్య సంస్థ అధికారులు శాఖల వారీగా నివేదికలు అందజేశారు. కరువు రైతులను ఆదుకునే విధంగా కేంద్ర ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని కేంద్ర బృందం సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి గోవిందనాయక్, డోన్ ఏడీఏ అశోక్ వర్ధన్ రెడ్డి, తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి, ఏఓ కిరణ్ కుమార్, సింగిల్ విండో అధ్యక్షులు నారాయణ, ఎంపీడీఓ వెంగన్న, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, కమిషనర్ రమేష్ బాబు, సింగిల్ విండో అధ్యక్షులు నారాయణ పాల్గొన్నారు.



కేంద్ర బృందానికి వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

అంగన్‌వాడీ సేవలు యథాతథంగా అందాలి

- ఇన్‌చార్జ్ జిల్లా కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ జిల్లా కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి

నంద్యాల: అంగన్‌వాడీల నిరవధిక సమ్మె నేపథ్యంలో చంటి పిల్లలు, గర్భిణులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఇన్‌చార్జ్ జిల్లా కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అంగన్‌వాడీ కార్యకర్తల ప్రత్యామ్నాయ సేవలపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు నిరవధిక సమ్మెలో పాల్గొని ధర్నా చేస్తున్న సందర్భంగా అంగన్‌వాడీ సెంటర్లు మూతపడకుండా, చంటి పిల్లలు, గర్భిణులకు అంగన్‌వాడీ సేవలు అందించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఇందులో భాగంగా జిల్లాలోని ఎంపీడీఓలు, ఐసీడీఎస్ సీడీపీఓలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, ఏపీఎంలు, డిప్యూటీ సీఈవో, డీఆర్‌డీఏ పీడీ, మున్సిపల్ కమిషనర్లు, సచివాలయ సిబ్బందికి సంబంధిత అంగన్‌వాడీ సెంటర్లను అనుసంధానం చేయాలని సూచించారు. అంగన్‌వాడీ సెంటర్ల మనుగడకు ఎలాంటి అంతరాయం కలుగకుండా, అంగన్‌వాడీ సేవలు యథాతథంగా కొనసాగేలా చూడాలన్నారు. జిల్లాలో మెయిన్ అంగన్‌వాడీ సెంటర్లు 1,620, మినీ అంగన్‌వాడీ సెంటర్లు 43 మొత్తం కలిపి 1,663 అంగన్‌వాడీ సెంటర్లు పనిచేస్తున్నాయన్నారు. ఈ సెంటర్ల ద్వారా చంటి పిల్లలకు పంపిణీ చేసే పౌష్టికాహారం, పాలు, గుడ్లు, బాలామృతం, గర్భిణులకు, బాలింతలకు పంపిణీ చేసే బియ్యం, బ్యాళ్లు, నూనె, వైఎస్సార్ కిట్టు, పాలు, గుడ్లు తదితరాలు సకాలంలో పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ మేరకు పక్కాగా ప్రణాళిక రూపొందించి చర్యలు తీసుకోవాలని సూచించారు.

17న కార్డుదారులకు సరుకుల పంపిణీ

నంద్యాల(అర్బన్): ఏదైనా అనివార్య కారణాల వల్ల ఈనెల నిత్యావసర సరుకులు అందుకోని కార్డుదారులు ఈ నెల 17న సంబంధిత వార్డు సచివాలయాల వద్ద సరుకులను పొందవచ్చని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎండీయూ వాహనాల ద్వారా ప్రభుత్వం ప్రతి నెల కార్డుదారులకు సబ్సిడీపై బియ్యం, రాగులు, చక్కెర, కందిపప్పు, గోదుమపిండి ఇంటి వద్దకే వచ్చి ఎండీయూ వాహనాల ద్వారా ఆపరేటర్లు అందిస్తున్నారన్నారు. సబ్సిడీ సరుకులు సకాలంలో పొందని కార్డుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థలో ఏవైనా సమస్యలు ఉంటే టోల్ ఫ్రీ నెంబర్1967కు ఫిర్యాదు చేయాలన్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్ట్



నిందితులను అరెస్ట్ చూపుతున్న కోడుమూరు సీఐ మన్సురుద్దీన్

కోడుమూరు రూరల్: కోడుమూరులో ఈనెల 10వ తేదీ రాత్రి రవి (24) హత్యకు గురికాగా, ఈ కేసులో నిందితుల అరెస్ట్ చేసినట్లు సీఐ మన్సురుద్దీన్ గురువారం విలేకరులకు తెలిపారు. సీఐ తెలిపిన వివరాల మేరకు.. రవికి, శివకృష్ణ, శివ, పిప్పల రాము, పిక్కిలి అశోక్‌ల మధ్య మనస్పర్థలు ఉండేవి. ఈనెల 10వతేదీ ఆదివారం శివకృష్ణ, శివ కోడుమూరు పాత బస్టాండ్ సెంటర్‌లో రోడ్డు దాటుతుండగా రవి, సాయి కుమార్‌లు వేగంగా మోటార్ సైకిల్ నడుపుతూ వెళ్లారు. శివకృష్ణ బిగ్గరగా వారి వైపు చూడడంతో రవి కొట్టాడు. దీంతో ఆవేశానికి లోనైన శివకృష్ణ ఇంటికి వెళ్లి కత్తిని తెచ్చుకున్నాడు. రాము, బోయ అశోక్, మరో మైనర్ బాలుడు రవితో గొడవపడతుండగా..శివకృష్ణ వెంట తెచ్చుకున్న కత్తితో రవి వరబీజాల దగ్గర పొడిచాడు. తీవ్రంగా గాయపడిన రవిని స్నేహితులు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. హత్య కేసు నమోదు చేసిన కోడుమూరు, గూడూరు ఎస్ఐలు శ్రీనివాసులు, పీరయ్యలు రెండు బృందాలుగా ఏర్పడి గురువారం మండలంలోని ప్యాలకుర్తి రోడ్డులో ఉన్న నిందితులు శివకృష్ణ, పిప్పల రాము, పిక్కిలి అశోక్‌లను అరెస్ట్ చేసినట్లు సీఐ మన్సురుద్దీన్ తెలిపారు. హత్య కేసును చేధించడంతో పాటు నిందితులను త్వరగా పట్టుకునేలా కృషి చేసిన ఎస్ఐలు శ్రీనివాసులు, పీరయ్య, సిబ్బందిని సీఐ అభినందించారు.



కె.శ్రీనివాసులు, కె.సుగుణ దంపతులు పాత ఆర్టీఓ కార్యాలయం సమీపంలో ఓ చిన్న బంకు ఏర్పాటు చేసుకొని కులవృత్తిని కొనసాగిస్తున్నారు. సుమారు 25 సంవత్సరాలుగా ఇక్కడే వీళ్లు చెప్పులు కుడుతున్నారు. రోజంతా కష్టపడితే వచ్చే రూ.500–రూ.700 డబ్బుతో వీరి కుటుంబం గడుస్తుంది. ఇద్దరు కూతుళ్లు సంతానం కాగా, పెద్ద కుమార్తె ఏఎన్ఎం కోర్సు పూర్తి చేసింది. చిన్నమ్మాయి 8వ తరగతి చదవుతోంది. షోరూంలు ఏర్పాటయ్యాక బతుకు దుర్భరంగా మారినా, నమ్ముకున్న వృత్తి కడుపు నింపుతోందని అభిప్రాయపడ్డారు.

కడుపు నింపుతున్న కులవృత్తి

- ఒకప్పుడు చెప్పుల తయారీతోనే ఉపాధి
- ఇప్పుడు మరమ్మతులకే పరిమితం
- షూ మార్ట్‌ల రాకతో మారిన బతుకు చిత్రం
- రెడీమేడ్‌ల మాటున ఉపాధి కోల్పోయిన చర్మకారులు
- రోడ్డు పక్కన భారంగా జీవనం

చర్మకారులు	
నంద్యాల జిల్లా	కర్నూలు జిల్లా
2,439	1,153

ఈమె పేరు నాగరత్నమ్మ. పుట్టుకతోనే దివ్యాంగురాలు. తల్లిదండ్రులు చిన్నతనంలోనే చనిపోగా.. అనంతపురం నుంచి వచ్చి కర్నూలులో స్థిరపడింది. జాన్ అనే వ్యక్తి వద్ద చెప్పులు కుట్టడం నేర్చుకొని జీవనోపాధిగా మార్చుకుంది. మార్కెట్‌యార్డు ఎదురుగా ఓ బంకులో ఈమె తన బతుకుబండి లాగిస్తోంది. వచ్చిన అరకొర డబ్బుతోనే ఈమె తనతో పాటు కుమార్తెను పోషిస్తోంది. ఒకప్పుడు బాగానే ఉన్నా.. ఇప్పుడు వంద రూపాయల చెప్పులు రావడంతో వాడి పడేస్తున్నారని, కుట్టించుకునే వాళ్లు కానీ.. పాలిష్ చేయించుకునేందుకు కూడా చాలా తక్కువగా వస్తున్నారని చెబుతోంది.



పాదరక్ష.. బతుకు దీక్ష

ఒకప్పుడు కొత్త చెప్పులు కుట్టించుకోవడం సంపన్న కుటుంబాలకే పరిమితం. ఇందులో కూడా చర్మకారుల నేర్పరితనం కాళ్లకు హుందాతనం తీసుకొచ్చేది. సినిమాల ప్రభావంతో కిర్రు చెప్పులు తెరపైకి రాగా.. రాజకీయ నాయకులు, మంచి హోదాలో ఉన్న వాళ్లు వీటి పట్ల ఆకర్షితులయ్యారు. ఉన్న ఊళ్లలోనే వీటిని తయారు చేస్తుండగా.. మండల, జిల్లా కేంద్రాల్లో కొందరు కుల వృత్తికి మెరుగులు దిద్ది ఆదాయ వనరుగా మార్చుకున్నారు. కాలక్రమంలో చెప్పుల తయారీ పరిశ్రమగా మారడంతో ఈ వృత్తినే నమ్ముకున్న ఎన్నో కుటుంబాల జీవనం దుర్భరంగా మారింది. అయితే కొందరు ఇప్పటికీ రోడ్ల పక్కనే చిన్న బంకులు ఏర్పాటు చేసుకొని చెప్పులు కుడుతూ, పాలిష్ చేస్తూ వచ్చిన అరకొర డబ్బుతోనే సంతృప్తి చెందుతున్నారు. – సాక్షి, కర్నూలు డెస్క్

గతంలో ఎలాంటి వారైనా చెప్పులను తమ కాళ్లకు అనుగుణంగా కుట్టించుకునే వాళ్లు. గ్రామాల్లో తమ ఇంటి వద్దకే పిలిపించుకొని సైజులను ఇచ్చి ఇలా కుట్టాలని చెబితే చాలు.. వారం పది రోజుల్లో సిద్ధమైపోయేవి. ఇందుకు అప్పట్లో డబ్బులు ఇవ్వడం చాలా అరుదు. ఒకపూట భోజనం పెట్టడమో, లేక పోతే గింజలు వేయడంతో సరిపెట్టేవాళ్లు. ఇప్పుడు చెప్పులను కుట్టించుకునేవాళ్లు చాలా అరుదుగా మాత్రమే ఉంటున్నారు. ఈ కారణంగానే కుల వృత్తి కనుమరుగవుతూ వచ్చింది. పల్లెటూళ్లలో ఇప్పుడు కూడా ఒకరిద్దరు తమ వృత్తిని కొనసాగిస్తూ అందులోనే సంతోషం వెతుక్కుంటున్నారు.

పెరిగిన ధరలతో ఉపాధి కరువు

కర్నూలు నగరంలో ఒకప్పుడు 60కి పైగా కుటుంబాలు చెప్పులు కుట్టి ఉపాధి పొందుతుండగా.. ఇప్పుడు 30 కుటుంబాలు మాత్రమే ఈ వృత్తిని కొనసాగిస్తున్నాయి. గతంలో చెప్పులు కుట్టించుకునేందుకు పోటీ పడుతుండగా.. ఇప్పుడు ఆ పరిస్థితి లేకపోవడంతో ఈ వృత్తిని కొనసాగించే వారి సంఖ్య కూడా తగ్గుతోంది. చెప్పుల తయారీకి అవసరమైన సామగ్రి ధరలు పెరిగిపోవడం, ఆ స్థాయిలో ధర చెల్లించేందుకు ఎవరూ ఇష్టపడటం లేదని తెలుస్తోంది. ఈ కారణంగా రెడీమేడ్ చెప్పులను కొనుగోలు చేసి బంకుల్లో విక్రయానికి ఉంచుతున్నారు. వీటి ధర రూ.100 నుంచి రూ.250 వరకు మాత్రమమే ఉంటోంది.



కర్నూలు మార్కెట్ యార్డు రహదారిలో షూ పాలీష్ చేస్తున్న చర్మకారుడు

షూ మార్ట్‌ల రాకతో మారిన బతుకు చిత్రం

చెప్పుల తయారీ చర్మకారుల వరకే పరిమితమైనన్ని రోజులు ఆ కుటుంబాలకు కొంత ఉపాధి లభించింది. 1995 నుంచి పరిస్థితిలో మార్పు వచ్చింది. చెప్పుల తయారీ పరిశ్రమగా మారుతూ రావడంతో ఈ వృత్తినే నమ్ముకున్న వాళ్ల ఉపాధికి గండి పడింది. షూ మార్టుల రాకతో పాటు బడా కంపెనీలు రంగప్రవేశం చేయడంతో ఎక్కడికక్కడ అద్దాల షోకేస్‌లలో చెప్పులు, బూట్లు మెరిసిపోవడం మొదలైంది. అంతా రెడీమేడ్ తయారీ కావడం, మనసుకు నచ్చిన రకాలు ఉండటం.. ధర కూడా అందుబాటులో ఉండటంతో చేతి వృత్తికి ఆదరణ తగ్గిపోయింది. వీరు తయారు చేసిన చెప్పుల ధర అధికంగా ఉండటం, కంపెనీల నుంచి వచ్చే చెప్పుల ధర తక్కువగా ఉండటంతో అందరి అడుగులు కార్పొరేట్ వైపే మళ్లాయి.



ఇంత రేటా అనే నిట్టూర్పు

కొన్ని కుటుంబాలు ఇప్పటికీ ఇదే వృత్తినే నమ్ముకొని జీవనం సాగిస్తున్నాయి. జిల్లా కేంద్రం కర్నూలు విషయానికొస్తే రాధాకృష్ణ టాకీసు వద్ద చెప్పులు కుట్టే దుకాణం ప్రతి ఒక్కరికీ సుపరిచితమే. అదేవిధంగా మాధవనగర్, ఫైవ్ రోడ్ సర్కిల్, పెద్దాసుపత్రి, కృష్ణానగర్.. ఇలా కొన్ని కూడళ్లలో మాత్రమే చర్మకారులు ఇప్పటికీ కులవృత్తినే నమ్ముకొని జీవనం సాగిస్తున్నారు.

వేసుకున్నామా.. పడేశామా..

30 ఏళ్ల వెనక్కు వెళ్తే.. కుట్టించుకున్న చెప్పులు సుమారు ఏడాది కాలమైనా రావాల్సిందే. రబ్బరు చెప్పులకు రంధ్రాలు పడినా నడక అలాగే సాగేది. ఉంగటం ఊడిపోతే కింద పిన్నీసు పెట్టి ముందుకు కదిలేవాళ్లు. ఇంకొందరు చర్మకారుల వద్ద సరిచేయించుకుని హమ్మయ్యా ఇంకొన్ని రోజులు పని జరుగుతుందనుకునేవాళ్లు. ఇంక బూట్లు వేసుకునే వాళ్లు చర్మకారుల వద్ద పాలిష్ చేయించుకుని మురిసిపోయేవాళ్లు. ఇప్పుడు ఆ పరిస్థితి మారిపోయింది. కొనుగోలు చేస్తున్న చెప్పులు ఒకటి రెండు నెలలు వాడితే గగనమే. వేసుకున్నామా, పడేశామా అన్నట్లుగా తయారైంది. ఇక పాలిష్ అంటే.. ఇంట్లోనే చేసుకోవడం పరిపాటిగా మారింది.

అద్దాల భవంతుల్లో చెప్పిన ధర ఇచ్చి చెప్పులు కొనుగోలు చేసే వాళ్లు.. వాటికి మరమ్మతు చేయించే సమయంలో రోడ్డు పక్కన చర్మకారులతో బేరమాడటం విస్మయాన్ని కలిగిస్తోంది. వేల రూపాయలు పెట్టి కొనుగోలుకు వెనుకాడని వాళ్లు.. ఇక్కడికొచ్చి రూ.10–20 రూపాయలకు ఇంత రేటా అని నిట్టూరుస్తుండటం గమనార్హం.

కులవృత్తి కుటుంబానికి ఆసరా



తాతల కాలం నుంచి వస్తున్న కులవృత్తి కుటుంబానికి ఆసరాగా నిలుస్తోంది. చెప్పులు కుట్టుకుంటూనే ముగ్గురు పిల్లలను వాళ్ల కాళ్లపై నిలబడేలా చేశా. బతికినంతకాలం ఈ వృత్తిని కొనసాగిస్తా. కాలం ఎంత మారినా చేతి వృత్తులను నమ్ముకుంటే ఉపాధికి కొదవ లేదు. సుమారు 20 ఏళ్లుగా ఇదే పని చేస్తున్నా. చాలా సంతోషంగా ఉన్నాం. – అరదేశి జయరాముడు, చర్మకారుడు, కోవెలకుంట్ల

సాక్షి ఉద్యోగ అవకాశాలు
ప్రతి మంగళ, శుక్రవారములలో

WANTED
(1) Supervisor (TL)
Qly: Any Graduation 2-3 Years Experience on retail/Hotel industry.
(2) Operation Associates (M/F)
Qly : Inter.
SVC CINEMAS
SVC CINEMAS PVT. LTD
3rd Floor, City square Mall,
Kurnool. 9849965867.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ లిమిటెడ్,
జిల్లా కార్యాలయం, రైల్వేస్టేషన్ రోడ్, నంద్యాల - 518 502

రీ టెండరు నోటీసు

నెం.పిడిఎస్/93/దశ-II/2023-25 తేది: 13-12-2023

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ లిమిటెడ్, నంద్యాల వారు, ఎంఎల్ఎస్ పాయింట్ శ్రీశైలం నుంచి కేవలం శ్రీశైలం మండలంలో గల చౌకధరల దుకాణాలు/హాస్టళ్లు మొ॥వాటి వద్దకు, పిడిఎస్ క్రింద నిత్యావసర వస్తువులను కాంట్రాక్టు నిర్ధారించబడిన తేదీ నుంచి తేది: 31-03-2025 కాలపరిమితి వరకు రవాణా చేయుటకు ఆసక్తి గల పార్టీల నుంచి టెండర్లను కోరడమైనది.

టెండర్లు దాఖలు చేయుటలో ఆసక్తిగల పార్టీలు టెండరు ఫారంలను జిల్లా సివిల్ సప్లైస్ మేనేజరు కార్యాలయం, ఎపిఎస్‌సిఎస్‌సిఎల్, రైల్వే స్టేషన్ రోడ్, నంద్యాల నుంచి టెండరు ఫారం ధర రూ.5,000/-లను డిడి రూపంలో నంద్యాలలో చెల్లించబడునట్లుగా "Dist. Civil Supplies Manager, APSCSCL, Nandyal" పేరిట తీసి, చెల్లిస్తూ ఆఫీసు పనివేళల్లో పొందవలెను.

1. టెండరు ఫారంలు అమ్మకం తేది (మ॥3.00 గం॥ల వరకు) 22-12-2023
2. తేదినాటి 5.00 గం॥ల వరకు టెండర్లు దాఖలు చేయుటకు గల ఆఖరి తేది: 22-12-2023
3. జాయింట్ కలెక్టరు వారి కార్యాలయం, Nandyal వద్ద టెండర్లు తెరిచే తేది: 23-12-2023 నాటి ఉ॥ 10.00 గం॥లు

సం/- టి.రాహుల్‌కుమార్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ & ఇఒఇడి
ఎపిఎస్‌సిఎస్‌సిఎల్, నంద్యాల

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల విజేత కర్నూలు



జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు


నంద్యాల(న్యూటౌన్): 67వ రాష్ట్రస్థాయి అండర్–14 బాలుర క్రికెట్ పోటీల్లో కర్నూలు జట్టు విజేతగా నిలిచింది. స్థానిక ఎస్పీజీ క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీల్లో భాగంగా గురువారం ఫైనల్ మ్యాచ్ హోరాహోరీగా సాగింది. కర్నూలు, విశాఖ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో కర్నూలు జట్టు క్రీడాకారులు సత్తా చాటుతూ విజయం సాధించారు. ద్వితీయ స్థానాన్ని విశాఖపట్నం, తృతీయ స్థానాన్ని అనంతపురం కైవసం చేసుకుంది. అనంతరం విజేతలకు ఎస్‌డీఆర్ పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.కొండారెడ్డి ట్రోఫీ, మెమొంటోలు అందజేశారు. ఈ సందర్భంగా స్కూల్ గేమ్ ఫెడరేషన్ నంద్యాల జిల్లా కార్యదర్శి శివకుమార్, స్టేట్ అబ్జర్వర్ దిలీప్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్ద పీట వేస్తుందన్నారు. ఆడుదాం ఆంధ్ర పోటీల్లో క్రీడాకారులు ప్రతిభ చాటాలన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే స్పోర్ట్స్ కోటా కింద ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయన్నారు. కార్యక్రమంలో ఏపీ పీఈటీ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బత్తుల రవికుమార్, ప్రభాకర్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చాటిన ఆయా జిల్లాల జట్ల నుంచి క్రీడాకారులను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి నలుగురు క్రీడాకారులు ఎంపిక కావడం విశేషం. జనవరి నెలలో కేరళ రాష్ట్రం త్రివేండ్రంలో జరిగే జాతీయ స్థాయి స్కూల్ గేమ్ క్రికెట్ పోటీల్లో రాష్ట్ర జట్టు పాల్గొననుంది.

ఎంపికైన క్రీడాకారులు.. సాయిరిషి (కర్నూలు), రేవంత్ (తూర్పు గోదావరి), కిరణ్ కుమార్ (అనంతపురం), రేవంత్ వర్మ (వైజాగ్), రుత్విక్ కల్యాణ్ (కర్నూలు), సూర్యతేజ్ (కడప), చరణ్‌తేజ్ (విజయనగరం), జాయ్‌స్మిత్ (శ్రీకాకుళం), పాల్ సుదర్శన్ (కర్నూలు), సాయి తేజ (కృష్ణ), రంగ రామానుజన్ (వైజాగ్), తన్మయ్ (అనంతపురం), హరిహరణ్(కర్నూలు), వైతీష్ చంద్ర(వైజాగ్), భాను (వైజాగ్), తాహీర్ (కడప).

అంతర్ కళాశాలల అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభం



వంద మీటర్ల పరుగు పందెంలో పోటీ పడుతున్న అథ్లెట్లు

కర్నూలు (టౌన్): రాయలసీమ యూనివర్సిటీలో గురువారం వర్సిటీ స్థాయి అంతర్ కళాశాలల అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభమయ్యాయి. పోటీలను వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పీఎఫ్ రెహ్మాన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అందివచ్చిన అవకాశాలను వినియోగించుకొని రాణించాలన్నారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ సీవీ క్రిష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సుందరానంద పుచ్చ, వర్సిటీ స్పోర్ట్స్ డైరెక్టర్ శివకిషోర్ పాల్గొన్నారు.

విజేతలు వీరే..

- 100 మీటర్ల పరుగు పందెం పురుషుల విభాగంలో డి. ప్రవీణ్‌కుమార్, ఎస్. నబీసాహెబ్, వై.బ్రహ్మ, మహిళల విభాగంలో బి. రాజేశ్వరి, సి. అనూష , బి. నందిని మొదటి మూడు స్థానాల్లో నిలిచారు.
- 1500 మీటర్ల పరుగు పందెం పురుషుల విభాగంలో కె.సుదర్శన్, వై. వెంకట సునీల్, ఆర్. సాయిక్రిష్ణ సింగ్, మహిళల విభాగంలో సి. కల్పన, ఎం. నాగేంద్రమ్మ, కె. శ్రీవాణి.. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు.
- షాట్ పుట్ పురుషుల విభాగంలో ఎస్. సమీర్, ఎస్. మహబూబ్ బాషా, హరిష్, మహిళల విభాగంలో సి. గాయత్రి, జి. మంజుల, పి.జుబేదా, జావిలిన్ త్రో పురుషుల విభాగంలో ఎం. విజయ్‌రాజ్, జి.కిరణ్‌కుమార్, ఎస్. మహబూబ్‌బాషా, మహిళల విభాగంలో బి. దివ్య, కె. శ్రీ రాఘవి , యమున మొదటి మూడు స్థానాలు కైవసం చేసుకున్నారు.

విద్యార్థుల ప్రదర్శన ప్రశంసనీయం

- స్కీమ్స్ అండ్ సర్వీసెస్ అసిస్టెంట్ డైరెక్టర్ శామ్యూల్ పాల్



విజేతలకు మెమొంటో అందజేస్తున్న శామ్యూల్ పాల్

ఓర్వకల్లు: మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన వినూత్న ప్రాజెక్టులు ప్రశంసనీయమని స్కీమ్స్ అండ్ సర్వీసెస్ అసిస్టెంట్ డైరెక్టర్ శామ్యూల్ పాల్ అన్నారు. గురువారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో 'టింకర్ ఫెస్ట్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ జోషుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి శామ్యూల్‌తో పాటు, ఎంఈఓ ఓంకార్‌యాదవ్, టింకర్ ఫెస్ట్ మొంటార్ ఫయాజ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శామ్యూల్ పాల్ మాట్లాడుతూ ఉత్తమ అటల్ ల్యాబ్‌గా వరుసగా మూడవ సారి ఏపీ మోడల్ స్కూల్ ఎంపిక కావడం విశేషమన్నారు. విద్యార్థులను సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రాజెక్టులు రూపొందించే విధంగా తయారు చేసిన ప్రిన్సిపాల్ జోషుల, అటల్ ల్యాబ్ ఇన్‌చార్జ్‌ని అభినందించారు. విద్యార్థులు నైపుణ్యతతో రూపొందించిన ప్రాజెక్టులు ఆకర్షణీయంగా వున్నాయన్నారు. అనంతరం విజేతలకు మెడల్స్, మెమొంటోలతో పాటు, ప్రశంసాపత్రాలను అందజేశారు.

సంక్షేమ బావుటా

పేదలకు మేలు చేసే సీఎం జగన్ మళ్లీ గెలవాలి



కుమారుడు మల్లికార్జునతో వెంకటరమణమ్మ

నా ఒక్కగానొక్క కుమారుడు మల్లికార్జున పుట్టుకతోనే మరుగుజ్జుతో పాటు దివ్యాంగుడు. ఇప్పుడు 45 ఏళ్లు. ఇప్పటికీ చిన్న పిల్లవాడిలాగా చూసుకోవాల్సి వస్తుంది. పూర్తిగా నడవలేక పోతున్నాడు. నా భర్త శరాబు సుబ్బరాయుడు టైలర్ పని చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. 20 ఏళ్ల క్రితం గుండెపోటుతో కాలమయ్యాడు. ఆయన చనిపోయాక పూట గడవని పరిస్థితి. పక్క ఊళ్లలో వడ్లు పెట్టించుకొని కాలం గడిపేవాళ్లం. ఇల్లు తప్ప ఇతర ఆస్తి పాస్తులు ఏమీ లేవు. టీడీపీ ప్రభుత్వంలో నాకు రూ.500, నా కొడుకుకి రూ.1500 పింఛన్ వచ్చేది. ఆ డబ్బులు సరిపోయేవి కావు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక నేను, నా కొడుకు పింఛన్ డబ్బులతో సంతోషంగా బతుకుతున్నాం. కొడుక్కి వంద శాతం వైకల్యం ఉందని సర్టిఫికెట్ ఇవ్వడంతో రూ.5వేలు పింఛన్ ఇస్తున్నారు. నాకు రూ.2,750 వస్తుంది. జగన్ రావడంతోనే మా ఇద్దరికీ పింఛన్ డబ్బులు పెరిగాయి. వాటితోనే మూడు పూటలా తినగలుగుతున్నాం. ప్రతి నెలా రేషన్ కార్డు ద్వారా 35 కేజీల బియ్యం ఇస్తారు. ఇంతకు ముందు పింఛన్ డబ్బులు తీసుకోవాలంటే కంబగిరిస్వామి గుడి దగ్గరికి వెళ్లి ఎదురు చూసేవాళ్లం. ఇప్పుడు ఆ కష్టాలు లేకుండా పోయాయి. వలంటీర్ మా ఇంటి వద్దకే వచ్చి తెల్లవారుజామునే ఇచ్చి పోతున్నాడు. జగన్‌మోహన్‌రెడ్డి వల్లే మా కుటుంబం ముందుకు సాగుతుంది. ఆయన మేలును మర్చిపోలేం. పేదలకు మేలు చేసే సీఎం జగన్ మళ్లీ గెలవాలి. – వెంకట రమణమ్మ, మదనంతపురం, కొలిమిగుండ్ల మండలం

ఆపదలో ప్రభుత్వం ఆదుకుంది



మాది నిరుపేద కుటుంబం కుటుంబం. మాకు అర ఎకరం సొంత పొలం ఉండగా మరికొంత పొలాన్ని కౌలుగా పొంది వ్యవసాయం చేసేవాళ్లం. ఇద్దరు కుమార్తెలకు పెళ్లిళ్లు చేశాం. వ్యవసాయంలో నష్టాలు రావడంతో నా భర్త చిన్న సుబ్బరాయుడు రెండేళ్ల క్రితం క్రిమిసంహారక గుళికలు తిని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆ పరిస్థితుల్లో దిక్కుతోచని స్థితిలో ఉన్న నాకు జగనన్న ప్రభుత్వం ఆదుకుంది. మా ఇబ్బందులను ప్రభుత్వం గుర్తించి నా భర్త ఆత్మహత్య చేసుకోవడంతో ఎక్స్‌గ్రేషియా కింద రూ.7 లక్షలు అందజేసి ఆదుకుంది. అలాగే ప్రతి సంవత్సరం వైఎస్సార్ రైతుభరోసా ద్వారా ఏడాదికి రూ.13,500, ప్రతి నెల వితంతు పింఛన్ ఇస్తోంది. వైఎస్సార్ చేయూత ద్వారా రూ.50వేలు, వైఎస్సార్ ఆసరా కింద రూ.30వేలు వైఎస్సార్ సున్నా వడ్డీ ద్వారా మరి కొంత మొత్తం లభించింది. జగనన్న ప్రభుత్వం ఆపద సమయంలో అండగా నిలిచింది. సీఎం వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటాను. – ఇ. నాగలక్ష్మమ్మ, కాపులపల్లి గ్రామం, బనగానపల్లె మండలం

క్లుప్తంగా

ఉబికి వచ్చిన గంగమ్మ



గడివేముల: ఓ రైతు పొలంలో బోరు వేస్తుండగా గంగమ్మ పైకి ఉబికి వచ్చింది. గడివేముల ప్రాంతంలో సాధారణంగా 500 నుంచి 600 అడుగుల లోతు వేస్తేగాని నీటి జాడ దొరకదు. అయితే బుధవారం గడివేముల గ్రామానికి చెందిన రవీంద్రారెడ్డి పొలంలో కేవలం 450 అడుగులు లోతులోనే ఐదు ఇంచుల సామర్థ్యంలో గంగమ్మ ఉబికి వచ్చింది. దీంతో ఈ ప్రాంతాల రైతులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. నిరంతరంగా ఉబికి వస్తున్న నీటిని చూసేందుకు సమీప గ్రామాల ప్రజలు ఆసక్తి చూపారు.

రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మృతి

కల్లూరు: ఉలిందకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని 44వ జాతీయ రహదారి నాయకల్లు ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మృతి చెందాడు. బెంగళూరుకు చెందిన బాల కార్తికేయ రాజన్ (27) మైక్రోసాఫ్ట్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తుండేవాడు. డిసెంబర్ 4న బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు. హైదరాబాదులో విధుల్లో చేరేందుకు తల్లితో కలిసి బయలుదేరాడు. మార్గమధ్యంలో 44వ జాతీయ రహదారి నాయకల్లు ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద ముందు వెళ్తున్న పాల వ్యాను ఉన్నట్టుండి వేగం తగ్గించడంతో కారును అదుపు చేసుకోలేక వ్యాను వెనుకభాగంలో ఢీకొట్టాడు. ఈ ప్రమా దంలో బాల కార్తికేయ రాజన్‌కు బలమైన గాయమయ్యింది. తల్లికి కుడిచేతి మణికట్టు వద్ద రక్తగాయాలయ్యాయి. 108లో నగరంలోని కిమ్స్ హాస్పిటల్‌కు తరలించారు. అయితే కోలుకోలేక బుధవారం రాత్రి బాల కార్తికేయ రాజన్ మృతిచెందాడు.

నేటి నుంచి ఏఐకేఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాలు

కర్నూలు(సెంట్రల్): ఆల్ ఇండియా కిసాన్ సభ(ఏఐకేఎస్) జాతీయ కౌన్సిల్ సమావేశాలు శుక్రవారం నుంచి మూడు రోజులపాటు కర్నూలులో జరగనున్నాయి. ఈ సమావేశాలకు ముఖ్య అతిథులుగా ఏఐకేఎస్ అధ్యక్ష, కార్యదర్శులు అశోక్ ధవాలే, విజుకృష్ణన్ హాజరుకానున్నారు. మొదటి రోజు శుక్రవారం కర్నూలు కొత్త బస్టాండ్‌కు సమీపంలోని శంకరయ్య నగర్‌లో జెండా ఆవిష్కరణతో కౌన్సిల్ సమావేశాలు ప్రారంభమవుతాయి. మధ్యాహ్నం 3 గంటలకు సుందర్యసర్కిల్ నుంచి పాతబస్టాండ్‌లోని అంబేద్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ, అనంతరం బహిరంగ సభ నిర్వహిస్తారు. డిసెంబర్ 16,17 తేదీల్లో ప్రతినిధుల సభలు ఉంటాయి.

సాక్షి క్లాసిఫైడ్స్

AUTOMOBILES

VEHICLE FOR SALE

■ Seizing Car for Sale. IndusInd Bank నందు TATA ALTROZ XE Model-2020 Regd No. AP39 HE 8268, కార్లు అమ్మకానికి కలవు. సంప్ర: 93840 65287, 93909 39390 [L-806277]

■ Seizing Car for Sale. IndusInd Bank నందు Toyota Glanza GMT Model 2022 Regd. No. AP39 RU 2641 కారు అమ్మకానికి కలదు. సంప్ర: 99592 50926 [L-806278]

REAL ESTATE

PLOT FOR SALE

■ నెలసరి కంతులతో కర్నూలు - నంద్యాల రోడ్, తిప్పాయిపల్లె దగ్గర ఓపెన్ ప్లాట్లు కలవు. & ఓర్వకల్లు MRO ఆఫీస్ దగ్గర ఓపెన్ ప్లాట్లు కలవు. సంప్రదించండి: 99638 00314 [L-781194]

SERVICES

■ వ్యక్తిగత, వ్యవసాయ, వ్యాపార ప్రాపర్టీ కొరకు అతి తక్కువ వడ్డీతో రుణాలు, సిబిల్ అవసరం లేదు. NPA కూడా దరఖాస్తు. డాల్ఫిన్ ఫైనాన్స్, రాజన్, సెల్: 8437924006. [W-788967]

బంగారం కొనబడును

■ మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్ / ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డ్‌ట్రేడింగ్ కం. ఫోన్: 73821 14647. [V.6335]

WANTED

■ ప్రముఖ షాపింగ్ మాల్‌లో పని చేయుటకు సేల్స్ మెన్స్ & గర్ల్స్, ఫ్లోర్ ఇంచార్జ్, & క్యాషియర్ (Exp) కావలెను. మంచి శాలరీ+ఇన్సెంటివ్స్. అబ్దుల్లాఖాన్ ఎస్టేట్, కర్నూలు. 8185837786. [L-781193]

■ కర్నూలు జిల్లా, నంద్యాల, నందికోట్కూర్ స్ట్రోరేజి ప్రైవేట్ లిమిటెడ్ నందు పనిచేయుటకు 1)బిజినెస్ ఎగ్జిక్యూటివ్ మరియు 2) స్టోరేజ్ క్లర్క్స్ పై రెండు పోస్టులకు ఆసక్తిగల అభ్యర్థులు కావలెను. సంప్రదించండి. : 9394838383 [G-77]

■ స్పాట్‌జాయినింగ్.తిరుపతి నందు కేంద్ర ప్రభుత్వ సంస్థలలో కాంట్రాక్ట్/అవుట్ సోర్సింగ్ ద్వారా అటెండర్స్ / టెక్నీషియన్స్ (ITI Ele)జాబ్స్ కలవు. జీ:21K,రూం,భోజన సౌకర్యం. 9603233339. [T-4776]

■ కర్నూల్ మా బ్రాంచ్ నందు ఆన్‌లైన్ ఉత్పత్తుల డెలివరీ చెయ్యడానికి డెలివరీ బాయ్స్ కావలెను. పిప్పుల ప్రకారం,1 డెలివరీకి Rs. 18, బైక్, స్మార్ట్ ఫోన్ ఉండాలి.వ:18+.Ph: 8686242288, 9346553343 [HA.948]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర: 9573633520, 9059633520. [M-1221888]

■ JOB VACANCY: MAX PVT. LTD. Age: 18 to 45 yrs, Qul: 10th to Any Degree, Salary: 18000/- to 25000/- Contact: ✆ 9346416039. [T-778551]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.